క్లుప్తంగా

గద్దర్ ఒక పోరాట స్ఫూర్తి

కడియం: విప్లవ గాయకుడు గద్దర్ ఒక పోరాట స్ఫూర్తి అని వక్తలు స్మరించుకున్నారు. మండలంలోని వేమగిరిలో పత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గద్దర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సాయిరామ్ ఆటో యూనియన్ సభ్యులు, మాజీ సైనికుడు బొర్రా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కోదండ రామాలయం సెంటర్, శ్రీనివాస నగర్, జయశ్రీ గార్డెన్స్‌లోని 1,2,3,4,5 వీధులు, పిల్లి వారి వీధి , తోట రాములు నగర్, ఏవీ అప్పారావు రోడ్డు, శ్యామల నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఏవీ అప్పారావు రోడ్డు, అద్దేపల్లి కాలనీ, షీలానగర్, బైబిల్ ప్లేస్ ఏరియా, పాత సవేరా బార్ వెనుక వీధులు, శ్రీనివాస గార్డెన్స్, సాయి టవర్స్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, వేంకటేశ్వరస్వామి ఆలయం రోడ్, గోపాల్ నగర్ పుంత, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 40 ఎన్‌ఎస్‌ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు శుక్రవారం ఏకేసీ రోటరీ హాల్లో జరిగిన నంది అవార్డు ఉత్సవాలలో సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావును స్టేట్ టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్ సత్కరించారు.

అఖండ గోదావరి ప్రాజెక్టు పనుల పరిశీలన



బోట్‌పై పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న అఖండ గోదావరి ప్రాజెక్టు పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం పరిశీలించారు. పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్‌లతో కలసి పుష్కరఘాట్, హేవలాక్ వంతెన, బొబ్బర్లంక తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంబాలచెరువు: క్వారీ ఏరియాలోని డీమార్ట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గాడాలకు చెందిన నూలు శ్రీరామచంద్రమూర్తి (72) మెయిన్ రోడ్డులోని బీఆర్‌కే వస్త్ర దుకాణంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం డ్యూటీకి వస్తున్న సమయంలో డీమార్ట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఇసుక లారీ ఆయనను ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీరామచంద్రమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

7 నుంచి కన్నమాంబ పేరంటాలమ్మ జాతర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట నరసింహారావుపేట గ్రామదేవత కన్నమాంబ పేరంటాలమ్మ 127వ జాతర మహోత్సవాలు ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

ఉగాది నంది.. ఆనందం ఉప్పొంగి

- ప్రతిభావంతులకు ఉగాది నంది పురస్కారాలు
- పాన్ ఇండియన్ సోఫియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు
- ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రి దుర్గేష్, గజల్ శ్రీనివాస్



ప్రముఖ సిద్ధాంతి దండమూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్, గజల్ శ్రీనివాస్

సీటీఆర్ఐ: గోదావరి తీరంలో ఉగాది నంది పురస్కారాల సంబరం అంబరాన్ని తాకింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు శుక్రవారం వీటిని ప్రదానం చేశారు. స్థానిక ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాలులో ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన శుక్రవారం ఉగాది వేడుక వారోత్సవాల సందర్భంగా పురస్కారాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. మన పండగలు సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. విశిష్ట అతిథి మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు వారి ఆది పండగ ఉగాది అన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఉగాది పచ్చడిలో ఉండే షడ్రుచుల సమ్మేళనం ప్రతి ఒక్కరి జీవితాల్లో మిళితమై ఉంటాయన్నారు. పిఠాపురం సంస్థానాధీశులు రామరత్నారావు బహదూర్ మాట్లాడుతూ ప్రకృతిలో వచ్చే మార్పులకు ఉగాది ప్రతీక అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.హారిక జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు చెరుకువాడ రంగసాయి, జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం కమిషన్ ఏపీ చైర్మన్ అట్టాడ శ్రీనివాస్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, లుక్ ఆఫ్ ట్రెంజ్ వ్యవస్థాపకురాలు కె.కాంతిరేఖ, ప్రముఖ సామాజిక వేత్తలు డాక్టర్ నందిక మహాలక్ష్మీ కుమార్, డాక్టర్ చల్లగాని సతీష్ కుమార్ ప్రసంగించారు. అనంతరం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులకు కంకణం, కిరీట ధారణతో నంది జ్ఞాపిక, ప్రశంసాపత్రానిచ్చి ఘనంగా సత్కరించారు.

ఆనందంగా ఉంది



ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నందుకు గర్వంగా ఉంది. నా సేవలను గుర్తించి, నా రోగులకు అందమైన చిరునవ్వు అందించడానికి నా కృషిని ప్రశంసించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. వారి ప్రశంసలే నాకు నిజమైన బహుమతి. అత్యుత్తమ ఇ-విజిలెన్ ప్రొవైడర్‌గా గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. పాన్ ఇండియా అసోసియేషన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు.

– డాక్టర్ శృతి, దంత వైద్యనిపుణులు, హైదరాబాద్

బాధ్యతను పెంచింది



ఉగాది నంది పురస్కారాన్ని అందుకోవడం నా బాధ్యతను మరింత పెంచింది. నేను 12 ఏళ్లుగా ఉచిత వేసవి చిత్రలేఖనం తరగతులు నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నాను. మా సేవలను గుర్తించి పురస్కారాలతో సత్కరించినందుకు ధన్యవాదాలు.

– ఇజ్జిన వినోద్ కుమార్, మనం ఆర్ట్స్ అకాడమీ, రాజమహేంద్రవరం

ప్రత్యేక అభినందనలు



దూరదర్శన్‌లోని సప్తగిరి చానల్‌లో ప్రసారమవుతున్న అభిమానం (ఉమెన్ ఎంపవర్మెంట్) డైలీ మెగా సీరియల్‌కు నాకు నంది అవార్డు ప్రకటించడం చాలా ఆనందకరంగా భావిస్తున్నాను. మహిళా అభివృద్ధి, మహిళ ఉన్నత స్థానంలో ఉండేలా తెలియజేస్తూ ఆ దిశగా కొనసాగుతున్న ఇటువంటి సీరియళ్లను ప్రోత్సహిస్తూ నాకు అవార్డు అందించినందుకు కృతజ్ఞతలు.

– మల్లవరం రమణ, నిర్మాత, రమణ టెలిఫిలిమ్స్, విజయవాడ

ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ వెబినార్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ వెబినార్ జరిగింది. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, సోషల్ వర్క్ విభాగాలు సంయుక్తంగా స్థితిస్థాపక కథల శక్తి, తీర ప్రాంత ఆంధ్రప్రదేశ్ నుంచి అంతరాష్ట్రులు అనే అంశంపై ఈ వెబినార్‌ను నిర్వహించాయి. దీనిలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని, విపత్తు స్థితిస్థాపకత, కమ్యూనిటీ సాధికారతపై అట్టడుగు స్థాయి కథల ప్రభావాన్ని చర్చించారు. కెనడాలోని థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్, నేపాల్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాలరాజు నిక్కు ముఖ్య అతిథిగా హాజరై కీలక ఉపన్యాసం అందించారు. భారతదేశం, నేపాల్, మలేషియా, కెనడాలో తన అనుభవాలను పంచుకున్నారు. కొల్లేరు (ఏలూరు) ఫీల్డ్ క్యాంప్ నుంచి వెలువడిన ముఖ్యమైన పరిశోధన ఫలితాలను వెల్లడించారు. థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం బ్లాగ్, గ్లోబల్ నెట్‌వర్క్ ఫోటో వీక్ కార్యక్రమాల్లో విద్యార్థులు తమ రచనలను ప్రచురించే అవకాశాన్ని ఆయన ప్రకటించారు. ఈ వెబ్‌నార్‌ను సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సీతామహాలక్ష్మి కస్తూరి ప్రారంభించగా, జర్నలిజం విభాగం తరపున డాక్టర్ శంకరరావు మల్లవరపు, డాక్టర్ బాబ్జీ పోతురాజు, సయ్యద్ ఫరా యస్రూన్, డాక్టర్ శివకోటిరాణి, సరోజ, రామారావు, రామకృష్ణ, కుసుమ కుమారి, పద్మ కుమారి, శ్రీకాంత్ ఎస్. సూర్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: 60 ఏళ్లు నిండిన ఆప్కాస్ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు విధుల్లోకి రాకూడదని తీసుకొచ్చిన 15వ నంబర్ జీవోను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఎవరైనా మృతి చెందినా, విరమణ చేసినా వారి కుటుంబీకులకే ఉద్యోగాలు ఇచ్చే పద్ధతి గతంలో ఉండేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం దానిపై స్పష్టత ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో 20 మందికి పైగా కార్మికులను శనివారం నుంచి విధుల్లోకి రావద్దని ఆదేశించడం దారుణన్నారు. ఉద్యోగుల మాదిరిగా మున్సిపల్ కార్మికులకు కూడా 62 ఏళ్లకు సర్వీస్ పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.దుర్గమ్మ, ఉపాధ్యక్షులు బంగారు గిరి, అల్లం బాలు, గూడుపు వెంకటగిరి పాల్గొన్నారు.

చిరుజల్లులతో సేదతీరిన జనం

కడియం: దాదాపు ఐదారు రోజులుగా ఎండల తీవ్రతతో సతమతం అవుతున్న జనం శుక్రవారం కురిసిన చిరుజల్లులతో కాస్తంత సేదతీరారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉదయం నుంచీ కొద్దిసేపు ఎండ తీవ్రత, మరికొద్దిసేపు మబ్బుల వాతావరణం నెలకొంది. ఉదయం వీరవరం, కడియపులంక, దామిరెడ్డిపల్లి, కడియం తదితర చోట్ల వర్షం కురిసింది. సాయంత్రం దుళ్ల, మురమండ, మాధవరాయుడుపాలెం తదితర చోట్ల వర్షం పడడంతో ప్రజలు ఎండ తీవ్రత, ఉక్కపోతల నుంచి కాస్తంత ఉపశమనం పొందారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో వాతావరణ మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పెద్దగా తెగుళ్ల బెడద లేకపోవడంతో సమృద్ధిగా పంట చేతికి వస్తుందన్న ఆశలో రైతాంగం ఉంది. కానీ వాతావరణం మబ్బులు కమ్ముకుని, వర్షాల రాకను సూచిస్తుండడంతో రైతులు ఆందోళన పడుతున్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం





బొమ్మూరులోని సంతాన సీతారామాలయం, ఆలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎలక్ట్రిక్ కొండపై ఉన్న సంతాన సీతారామాలయం (బొమ్మూరు భద్రాద్రి)లో ఆదివారం ఉదయం 11.40 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ శాశ్వత ధర్మకర్త చింతా సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ఆనకట్ట నిర్మాణ సమయంలో..

ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణ సమయంలో సర్ ఆర్థర్ కాటన్ బొమ్మూరు కొండపై ఉన్న సమయంలో సంతాన సీతారామాలయం (బొమ్మూరు భద్రాద్రి) నిర్మించారు. నాటి రామాలయం స్థానంలో దానికి ఎదురుగా మరో రామాలయం కట్టారు. ఆ ఆలయం కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో పునర్నిర్మాణం చేపట్టి 2022 మార్చి 13వ తేదీన సంతాన సీతారామాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడ కల్యాణం జరిపించుకున్నా, కల్యాణం జరిపిన అక్షింతలు తలపై వేసుకున్నా పిల్లలు లేని దంపతులకు సంతానం కలుగుతుందని నమ్మకం. ఇక్కడ వినాయక, దత్తాత్రేయుడు, సుబ్రహ్మణ్య స్వామి ఉప ఆలయం కూడా ఉంది.

నేటి నుంచి మహాకాళేశ్వరాలయ తృతీయ వార్షికోత్సవం



మహాకాళేశ్వరాలయం



మహాకాళేశ్వరుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో వేంచేసియున్న మహాకాళేశ్వరాలయం తృతీయ వార్షికోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8.00 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, గోపూజ,యాగశాల ప్రారంభ ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధనలు జరుగుతాయి. సాయంత్రం బిల్వార్చన అష్టోత్తర శత కలశావాహన, మండప దేవత హోమాలు, ప్రాయశ్చిత్త హోమాలు, నీరాజన మంత్రపుష్పము వేదస్వస్తి నిర్వహిస్తారు. ఆదివారం విఘ్నేశ్వరపూజ, సీతారాముల కల్యాణం, ప్రాంగణ పరివేష్ఠిత దేవత మూల మంత్ర హోమాలు, నీరాజనం మంత్రపుష్పాలు, వేదస్వస్తి జరుగుతుంది. సోమవారం ఉదయం 8.00గంటల నుంచి మండపార్చనలు, హోమాలు, అష్టోత్తర కలశాభిషేకం, శనిభగవానుడి శిఖర యంత్రస్థాపన, మహాకాళేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం, మహాపూర్ణాహుతి, శివ కల్యాణము, నీరాజన,ం మంత్రపుష్పాలు, దీక్షాదంపతులకు ఆశీర్వచనం ఉంటాయి. కార్యక్రమాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని భక్తులందరూ పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని రాజమహేంద్రవరం రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పట్టపగలు వెంకటరావు కోరారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం రాజ్యాంగ విరుద్ధం



ఆజాద్‌చౌక్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన బిల్లును ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జాంపేటలోని ఆజాద్ చౌక్ సెంటర్‌లో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదించడం, తర్వాత రాష్ట్రపతికి పంపడం దారుణమన్నారు. వక్ఫ్ బోర్డులో అన్య మతస్థులు ఉండవచ్చు అనేది చాలా తప్పన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఒకవైపు ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇస్తూనే మరోవైపు ముస్లింల హక్కులు హరించే విధంగా పార్లమెంటులో కూటమి ప్రభుత్వ పార్లమెంటు సభ్యులకు విప్ జారీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీఉల్లా బేగ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఈ బిల్లు ప్రవేశపెట్టేటప్పుడు విపక్షాల సవరణలు కూడా లెక్కచేయకుండా ఆమోదించారన్నారు. సిటీ అధ్యక్షులు అబ్దుల్లా షరీఫ్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి ముస్లిం ఈ బిల్లుని వ్యతిరేకించాలని తద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హర్షద్, కొండరాజు, బెజవాడ రంగారావు, ఎండీ ఫసిఉల్లా బేగ్, ఎండీ హబీబుల్లా బేగ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణలు ఉపసంహరించాలి

ప్రకాశం నగర్: వక్ఫ్ సవరణలను ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా శుక్రవారం మధ్యాహ్నం ఆజాద్ చౌక్‌లో ముస్లిం ఐక్య వేదిక, రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందుత్వ మతోన్మాద అజెండా అమలులో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ముస్లింలపై అనేక దాడులు చేస్తోందని ఆరోపించారు. ఈ చట్టం వక్ఫ్ ఆస్తులను కబ్జా చేయడానికే తప్ప, వాటి అభివృద్ధికి ఎంతమాత్రం కాదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పి.తులసి, ఐ.సుబ్రహ్మణ్యం, పూర్ణిమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి



బాలాజీపేట సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బాలాజీపేట సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి కేక్ కట్ చేసి, అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 200 మందికి బిర్యానీ ప్యాకెట్లు అందించారు. జక్కంపూడి గణేష్ ఫాలోవర్స్ కేపీ నాయుడు, రాజేష్, సుధా, ఆవాల ఈశ్వర్, రాంకీ, ఓం ప్రకాష్, టింకు, అప్పా నాని, ముద్దాల అను, సూరంపూడి గోపి, రెడ్డి ప్రసాద్, మురళీ, అహ్మద్ పాల్గొన్నారు.

రూత్ ఓల్డేజ్ హోమ్‌లో..

బొమ్మూరు మురళీకొండపై గల రూత్ ఓల్డేజ్ హోమ్‌లో జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సత్తార్, షేక్ సమీరా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి హాజరై, వృద్ధులకు అన్నవితరణ చేశారు.

సినిమాలు



శ్యామల	:	రాబిన్‌హుడ్
సూర్యమినీ	:	ఏమైన్‌క్రాఫ్ట్‌మోవ్, సికిందర్
సూర్యప్యాలెస్	:	ఆర్య-2, ఎల్‌వైఎఫ్(లవ్‌యుఫాదర్)
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	రాబిన్‌హుడ్
అనుశ్రీ	:	వీరధీరశూర
రాజా	:	రాబిన్‌హుడ్
ఊర్వశి	:	ఎల్2ఎంపురాన్
మేనక	:	28సి
రంభ	:	శారీ
కుమారి	:	ఆర్య-2
అప్సర	:	మ్యాడ్ స్క్వేర్
అశోక	:	మ్యాడ్ స్క్వేర్
నామవరం		
వీఎస్ మహల్	:	మ్యాడ్‌స్క్వేర్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మ్యాడ్ స్క్వేర్
కడియం		
వెంకటసూర్య	:	మ్యాడ్ స్క్వేర్

మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

కంబాలచెరువు: ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతికి కారకుడైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్రాలు విఫలం చెందుతున్నాయన్నారు. వీటిని అరికట్టే దిశగా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉండి ఈ ఘటనపై స్పందించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. పోలీసులు కనీసం సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఎందుకు విచారణ జరిపించలేదన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన దీపక్‌ను శిక్షించాలన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలోనే జిల్లా వ్యాప్తంగా మహిళలపై అనేక అఘాయిత్యాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్, ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు మణిరత్నం, ఉష, జ్యోతి ప్రజ్వలన పాల్గొన్నారు.

చిత్రకళా ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు రోడ్డులో శుక్రవారం ఉదయం సాయంత్రం 5 గంటల వరకూ అమరావతి చిత్రకళ వీధి ప్రదర్శన జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు ప్రముఖులు, విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.



చిత్రకళా ప్రదర్శనలో వేషధారణలు



సీఆర్పీఎఫ్ జవాన్ వేసిన చిత్రాలు





ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత